క్లుప్తంగా

గీతా మందిరంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని గీతా జ్ఞానమందిరంలో గల శ్రీపార్థసారధి స్వామివారి ఆలయంలో బుధవారం వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విష్ణు సహస్రనామ పారాయణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. 17వ తేదీన యాగశాల ప్రవేశం, ధ్వజారోహణ కార్యక్రమాలు, 18న శ్రీరుక్మిణి సత్యభామ సమేత పార్థసారధిస్వామివారి కల్యాణోత్సవం, 19వ తేదీన మహాకుంభప్రోక్షణ, పుష్పయాగం నిర్వహించబడతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

నిత్యావసరాలు పంపిణీ



మహిళలకు నిత్యావసరాలు అందిస్తున్న దృశ్యం

వైరా: ఎలాంటి ఆదరణ లేక నిరాదరణకు గురి అవుతూ ఆకలితో అలమటించే వారికి లయన్స్ క్లబ్ అండగా ఉంటుందని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పెనుగొండ ఉపేందర్‌రావు అన్నారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని పాతసెంటర్ ఏరియాలో అనాథ వృద్ధ మహిళలకు బుధవారం మిట్టపల్లి నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను పురస్కరించుకోని నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ బాధ్యులు చింతలపూడి వెంకటేశ్వరరావు, కొమిరిశెట్టి శ్రీధర్, చింతోజు నాగేశ్వరరావు, రాయపూడి నారాయణ, కట్ల సురేష్, కొల్లా రాంబాబు, వనమా వెంకటేష్ పాల్గొన్నారు.

నిరుపేదకు ఆర్థిక సాయం



నిత్యావసరాలు అందిస్తున్న మల్లికార్జునరావు కుటుంబ సభ్యులు

మధిర: మధిర పట్టణంలోని రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో నివసిస్తున్న నిరుపేద కుటుంబానికి బుధవారం ఆర్థిక సాయం చేశారు. బూరెల మల్లికార్జునరావు జయంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమం చేపట్టారు. సామాజిక సేవకులు, ఆరోగ్య పర్యవేక్షకుడు లంకా కొండయ్య సహకారంతో దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న పులిమంతుల రాజుకి పెన్షన్ రావడం లేదు. ఆర్థిక ఇబ్బందులతో పాటు బుద్ధిమాంద్యంతో బాధపడుతున్న ఆయనకు మల్లికార్జునరావు సతీమణి రుక్మిణి చేతుల మీదుగా నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లిఖార్జునరావు కుమార్తెలు రూప, రాజేశ్వరి, నాగమణి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

శేషగిరిరావు మృతిపై సంతాపం

కల్లూరు: డీసీఎంఎస్ జిల్లా మాజీ చైర్మన్ రాయల శేషగిరిరావు ఆకస్మిక మృతి పట్ల బీఆర్ఎస్ కల్లూరు మండల నాయకులు తీవ్ర సంతాపం తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, నాయకులు హుటాహుటిన ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి.. సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో ఎంపీపీ రఘు, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, నాయకులు రఘు, రామారావు, లక్ష్మణరావు, వెంకటేశ్వరరావు, ఇస్మాయిల్, కమ్మి, రామకృష్ణ, నాగేశ్వరరావు, ప్రసాద్, వెంకటరత్నం, కృష్ణ, రజనీకాంత్, కిరణ్, అర్లప్ప, సందీప్, రవూఫ్, అంజి, శంకర్‌రావు, నరసింహారావు తదితరులు ఉన్నారు.

హెల్త్ సబ్‌సెంటర్‌కు కుర్చీల వితరణ



కుర్చీలు అందజేస్తున్న దాతలు

కారేపల్లి: మండల పరిధిలోని విశ్వనాథపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన షేక్ పెద్ద షరీఫ్ తన తండ్రి షేక్ నవాబ్ జ్ఞాపకార్థం 10కుర్చీలను వితరణగా బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు మహేశ్వరీ, గ్రామ పెద్దలు వల్లభనేని ప్రభాకర్‌రావు, తాతా వెంకటేశ్వర్లు, మురళి, ఎఎన్ఎం అంజలి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు అస్వస్థత

ముదిగొండ: ముదిగొండ తహసీల్దార్ వై.రామారావు బుధవారం అస్వస్థతకు గురయ్యారు. ఆయన ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. గుండెపోటు రావడంతో వైద్యులు చిక్సిత చేసి స్టంట్ వేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల విధుల నిర్వహణలో బాగంగా బదిలీపై వచ్చారు.

వద్దంటే.. వద్దే వద్దు..



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి, దయానంద్(ఫైల్)

- కాంగ్రెస్‌లో చేరికలపై క్లారిటీ
- స్థానిక నాయకత్వం అనుమతి ఉంటేనే..
- ఇంటి దొంగల కామెంట్లపై రాజకీయ రచ్చ

సత్తుపల్లి: రాజకీయాల్లో పార్టీలు మారటం సహజం .. ఎన్నికల ముందు పార్టీలు మారి ఆ పార్టీ విజయం కోసం పని చేయటం ఒక ఎత్తైతే.. అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ మారటం మరో పరిణామం. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ముందుకొచ్చిన ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొందరు నేతలకు స్థానిక నాయకత్వం నుంచి ఆమోదం లభించలేదు. ఎలాగైనా కాంగ్రెస్ పార్టీలో చేరే ప్రయత్నంలో బీఆర్ఎస్ పార్టీకి రాజీనామాలు చేసి మద్దతు ప్రకటిస్తూ కొత్త తరహా రాజకీయానికి తెరలేపటం పట్ల కాంగ్రెస్ పార్టీలోని ఓ వర్గం గుర్రుగా ఉంది. స్థానిక నాయకత్వం వద్దన్నవారిని కాంగ్రెస్‌లో మరోవర్గం చేరదీయటంపై రాజకీయ రచ్చ జరుగుతుంది. చేరికలు వద్దంటే.. వద్దేవద్దని.. స్థానిక నాయకత్వం ఖరాకండిగా తెగేసి చెపుతుంది.

ఎమ్మెల్యే ఆమోదం ఉంటేనే..

సత్తుపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలపై డాక్టర్ మట్టా దయానంద్ ఇచ్చిన స్పష్టమైన క్లారిటీ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చానీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీలో చేరికలకు వ్యతిరేకం కాదంటూనే పార్టీకి పనికొచ్చే క్యాడర్‌ను చేర్చుకుంటామని, పార్టీని వర్గాలుగా విభజించే లీడర్‌స్థాయి వ్యక్తులను చేర్చుకోమని స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఎమ్మెల్యేతో కలిసి పనిచేసే ఉద్దేశంతో కాంగ్రెస్‌లో చేరిన వారిని అక్కున చేర్చుకుంటామని, అధికారాన్ని అనుభవించేందుకు వచ్చిన వారికి అవకాశం ఉండదని తేగేసి చెప్పటం రాజకీయ వర్గాలలో చర్చానీయాంశమైంది. స్థానిక ఎమ్మెల్యేను కాదని కాంగ్రెస్ పార్టీలో చేరినా.. పార్లమెంట్ ఎన్నికల్లో కనీసం పార్టీ నుంచి పిలుపు అందలేదు. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎన్నికల రాజకీయానికి దూరంగా ఉండాల్సి వచ్చింది.

ఇంటి దొంగలను పక్కన పెట్టాం..

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇంటి దొంగల వల్లనే మెజార్టీలు తగ్గాయని.. అలాంటి వారిని ఈ పార్లమెంట్ ఎన్నికల్లో పక్కన పెట్టామని డాక్టర్ మట్టా దయానంద్ చేసిన వ్యాఖ్యలు సంచలనం కలిగించింది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో ఉండి ప్రత్యర్థి పార్టీకి పనిచేశారనే విధంగా వ్యాఖ్యానించటం రాజకీయ దుమారాన్ని రేపుతుంది. ఇకపోతే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అసెంబ్లీ ఎన్నికల్లో కష్టపడి పని చేసిన వారికే పదవులు దక్కుతాయని, పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారికి అవకాశం ఉండదని తేల్చిచెప్పటం చర్చానీయాంశమైంది.

పార్టీ మారిన ఫలితం దక్కటం లేదని ఇటీవల హస్తం గూటికి చేరిన నేతలు మధనపడుతున్నారు. కాగా బీఆర్ఎస్ పార్టీలోనైతే గత అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో బలమైన నాయకత్వం పని చేసినా.. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూడాల్సి వచ్చిందని, పార్టీల మార్పులు, చేర్పులపై తమదైన శైలిలో పెదవి విరుస్తున్నారు.

ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలి



ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్న వైద్యురాలు వసంత

చింతకాని: దివ్యాంగ పిల్లల కోసం నిర్వహించే ఫిజియోథెరపీ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఫిజియోథెరపిస్ట్ వల్లూరి వసంత తెలిపారు. మండలంలోని వందనం గ్రామపంచాయతీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ సహకారంతో మండల విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో ప్రత్యేక అవసరాలు కల్గిన దివ్యాంగ పిల్లలకు బుధవారం ఫిజియోథెరపీ వైద్యసేవలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో పాక్షిక పక్షవాతం, ఇతర శారీరక అంగవైకల్యం కల్గిన పిల్లలకు ఉచితంగా ప్రత్యేకంగా ఫిజియోథెరపీ సేవలు అందజేస్తున్నామని, దీంతో పిల్లల్లో శారీరక, మానసిక పరిపక్వత కనబడుతుందని తెలిపారు. ప్రతీ వారం నిర్వహించే ఈ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. పాక్షిక అంగవైకల్యం కల్గిన పిల్లలకు అవసరమైన సహాయ పరికరాలను అందజేయటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వీరభద్ర నాయక్, గ్రామ పంచాయతీ కార్యదర్శి చెవుల మహేష్, ఐఈఆర్పీలు కేఎస్ కృష్ణారావు, భూక్యా దస్లీ, అంగన్‌వాడీ టీచర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

వైరా: వైరాలో ఈ నెల 19,20 తేదీల్లో నిర్వహించే సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సీ.వై పుల్లయ్య పిలుపునిచ్చారు. వైరాలోని పార్టీ కార్యాలయంలో శిక్షణ తరగతుల నిర్వాహణపై బుధవారం సమావేశం నిర్వహించారు. శిక్షణ తరగతుల్లో గతి తర్కం భౌతికవాదం, శ్రమ, సరుకు, పెట్టుబడి, భారతదేశ చరిత్ర, పార్టీ నిర్మాణం-కార్యకర్తలు ఎలా ఉండాలనే అంశాలను వివరిస్తామని తెలిపారు. సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ విప్లవ కమ్యూనిస్ట్ పార్టీగా, మన దేశంలో కార్మిక, కర్షక, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. శిక్షణ తరగతుల్లో అధిక శాతం మంది పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ వైరా డివిజన్ కమిటీ సభ్యులు కంకణాల అర్జున్‌రావు, యలదండి బాబు, తడకమళ్ల సీతారాములు, బంక మరియమ్మ, బండారు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ నిమిత్తం గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ శరత్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న అనిన ఫీడర్లలో అంతరాయం జరుగుతుందన్నారు. సత్తుపల్లిటౌన్-1, 2, 3, కిష్టారం, కాకర్లపల్లి ఫీడర్లలో అంతరాయం కలుగుతుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఐదేళ్ల కాలంలో అంతా నిల్..



ముదిగొండ మండల పరిషత్ కార్యాలయం

నిధుల్లేవ్.. ప్రాధాన్యత లేదు..!
- పేరుకే ఎంపీటీసీ, జెడ్పీటీసీలు
- ఉత్సవ విగ్రహాలుగా మారిన వైనం

ముదిగొండ: ఎన్నికల్లో లక్షలు ఖర్చు చేసినా, ఐదేళ్లు పూర్తికావస్తున్నా, ఇప్పటి వరకు నిధులు రాలేదు. పేరుకే ఎంపీటీసీ, జెడ్పీటీసీలు.. కానీ నిధులు లేవు, నిధుల్లేవ్.. అంతకన్నా ముఖ్యం.. ప్రాధాన్యత లేదు.. ప్రజాప్రతినిధులు అన్న మాటే తప్ప.. ఎందుకు పనికిరాకుండా, ఉత్సవ విగ్రహాలుగా మిగులుతున్నామని ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. ఐదేళ్ల కాలంలో ఇదీ ఎంపీటీసీల గోడు..

ఆవేదనలో ఎంపీటీసీలు..

ఎంపీటీసీ సభ్యులకు గత ఐదేళ్లల్లో వారికి వచ్చింది. కేవలం రూ.2 లక్షల లోపు మాత్రమే. వీటితో గ్రామాల్లో ఏమి అభివృద్ధి చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. మధిర నియోజకవర్గంలో 68 ఎంపీటీసీలు ఉండగా.. వారిలో ఎక్కువగా మంది ఆర్థికంగా వెనకబడిన వారే ఉన్నారు. ఏ ప్రభుత్వం ఉన్నా ఎంపీటీసీ లపై చిత్తశుద్ధి చూపించాలి. నిధులు మంజూరు చేయాలి.

పేరుకే ప్రజాప్రతినిధులు..

పరిషత్ ఎన్నికలు జరిగి ఐదేళ్లు పూర్తికావస్తుంది. గతంలో జెడ్పీటీసీల ద్వారా గ్రామాలకు నిధులు అందేవి. కానీ 15వ ఆర్థిక సంఘం ద్వారా నిధులు జెడ్పీటీసీల ద్వారా కాకుండా జీపీలకు చేరుతుండటంతో పరిషత్‌ల పాత్ర, ప్రాధాన్యం కోల్పోయింది. ప్రస్తుత విధానంలో ఆర్థిక సంఘం ద్వారా 80 శాతం నిధులు గ్రామపంచాయతీలకు, మండల పరిషత్‌లకు 15 శాతం, జిల్లాపరిషత్ లకు 5 శాతం లెక్కన కేటాయింపులు జరిగాయి. ఈ లెక్కన ఒక్కో జెడ్పీటీసీకి ఏడాదికి రూ.5 నుంచి రూ.10 లక్షలు రావాల్సి ఉంది. కానీ ఆ విధంగా నిధులు అందలేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఎంపీటీసీ సభ్యులకు 15వ ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేశారు. అయినప్పటికీ వారికి ఆశించిన నిధులు రావటం లేదని అసంతృప్తితో రగులుతున్నారు.

నిధులు ఇవ్వాలి..



ఎంపీటీసీలకు పంచాయతీ సర్పంచ్‌లతో పాటు సమానంగా నిధులు ఇవ్వాలి. తమకు ఇచ్చే అరకొర నిధులతో అభివృద్ధి ఎలా సాధ్యంమవుతుంది. ఎంపీటీసీలను నిర్వీరం చేసే విధంగా ఉంది. పంచాయతీ నిధులతో పాటు, ఎంపీటీసీ నిధులు కలిస్తే గ్రామాలు బాగుపడుతాయి.

– కోలేటి అరుణ, ఎంపీటీసీ, చిరుమర్రి

ఉత్సవ విగ్రహాలమా...



గత ప్రభుత్వం ఎంపీటీసీలను ఉత్సవ విగ్రహాలుగా చూసింది. కనీసం ప్రోటోకాల్ కూడా పాటించలేదు. నిధులు లేవ్, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రాధాన్యత లేదు. ఏ ప్రభుత్వం ఉన్నా, ఎంపీటీసీలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు సకాలంలో అందించాలి.

– బిచ్చాల బిక్షం, ఎంపీటీసీ, వల్లబి

ఇదేనా గౌరవం..



ఎంపీటీసీగా గెలిచి ఐదేళ్లు పూర్తికావచ్చింది. కానీ ప్రజలకు ఇచ్చిన హమీలను నెరవేర్చేందుకు నిధులు లేవు. ఎంపీటీసీలుగా గెలిచినందుకు ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా.. ఎంపీటీసీ పరిధిలోని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి.

– యరబోలు పిచ్చెమ్మ, ఎంపీటీసీ, మాధాపురం

పంట అవశేషాలను కాల్చొద్దు..



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ కరుణశ్రీ

కొణిజర్ల: పంట అవశేషాలను కాల్చవద్దని వైరా ఏడీఏ కరుణశ్రీ కోరారు. మండలంలోని మల్లుపల్లిలో బుధవారం రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రైతులు వరి, మొక్కజొన్న, పత్తి, మిరప పంటలు పూర్తి అయిన తరువాత పంట అవశేషాలను కాల్చడం వలన భూమిపై పొరల్లో ఉపయోగపడే సూక్ష్మజీవులు చనిపోతాయన్నారు. దీని వలన హానిచేసే సూక్ష్మజీవులు పెరుగుతాయన్నారు. భూమిలో కార్బన్ శాతం తగ్గుతుందని, కాలుష్యం పెరిగి రోగాలు ఊపిరితిత్తులు జబ్బులు, గుండె జబ్బులు వస్తాయన్నారు. ఇది చట్టరీత్యా నేరం అన్నారు. అదే భూమిలో కలియదున్నడం వలన భూమిలో కార్బన్ శాతం పెరగడంతో పాటు నత్రజనిశాతం పెరుగుతుందన్నారు. భూమికి రోగనిరోదకశక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బాలాజి, ఏఈఓ కుమార్ రాజ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకు కృషి

మధిర: సమాజ సేవకు మధిర పట్టణానికి చెందిన భరత్ విద్యాసంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ శీలం విద్యాలత దంపతులు చేస్తున్న కృషి అభినందనీయమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని విక్రమార్క తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం శీలం వెంకటరెడ్డి, విద్యాలత దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో నందిని విక్రమార్క మాట్లాడుతూ అతి తక్కువ ఫీజులతో మధిర ప్రాంతానికి నాణ్యమైన విద్యను అందిస్తున్న వెంకటరెడ్డి దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ హోదాలో గ్రామాభివృద్ధికి వారు శక్తివంచన లేకుండా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎర్రుపాలెం మండల కాంగ్రెస్ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, నాయకులు బండారు నరసింహారావు, దారా బాలరాజు, అద్దంకి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలో ఇటీవల మృతి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, టీడీపీ సీనియర్ నాయకుడు అంబటి వెంకటయ్య కుటుంబాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే తిమ్మినేనిపాలెం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ సర్పంచ్ అబ్దుల్ నబీ భార్య సమీనాను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, నాయకులు భాస్కర్, కిషోర్, గోవిందరావు, మనోహర్‌బాబు, నాగార్జున్, గోపి, బసవయ్య, సీతారామయ్య, శ్రీనివాసరావు, పాండురంగాచారి తదితరులు పాల్గొన్నారు.



అంబటి వెంకటయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మల్లు నందిని

పనుల వద్ద ప్రమాద ఘంటికలు



చిరుమర్రి చప్టా వద్ద ఇరుకు దారిలో వెళ్తున్న వాహనదారులు

ముదిగొండ: మండలపరిధిలోని చిరుమర్రి వద్ద ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై లోలెవల్ చప్టాపై పనులు జరుగుతున్నాయి. ఈ పనులు మొదలుపెట్టిన రెండు నెలల దగ్గర నుంచి చప్టాను లోతుగా తవ్వారు. రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి హెచ్చరిక బోర్డులు అమర్చలేదు. కనీసం రేడియం స్టిక్కర్లు కూడా ఏర్పాటు చేయలేదు, సమీపంలో స్పీడ్ బ్రేకర్లు లేవు. దగ్గరకు వచ్చే వరకు కనిపించకుండా ఉండడంతో రాకపోకలు సాగించే ప్రయాణికులు, పలు వాహనదారులు ఆందోళనకు గురౌతున్నారు. దీంతో పాటు సర్వీస్ రోడ్డు చప్టా పక్కనే ఉన్న పొలంలోకి తాత్కాలికంగా, తూతూ మంత్రం వేశారు. సర్వీస్‌రోడ్డు అధ్వానంగా, ఇరుకు కావడంతో ఇబ్బందులకు గురౌతున్నారు. సంభందిత అధికారులు కూడా ఆ పనుల వద్ద పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారుడు ఇష్టారీతిన పనులు చేపడుతున్నాడు. పనులు నాణ్యతతో చేపట్టి, ఇరువైపులా హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసి, ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



కల్లూరు బస్టాండ్

దాతల సాయంతో..

- కల్లూరు బస్టాండ్‌లో ఉచిత మజ్జిగ పంపిణీ
- వేసవి తాపం నుంచి ప్రయాణికులకు ఉపశమనం
- 60 రోజుల పాటు నిరంతరాయంగా..

కల్లూరురూరల్: కల్లూరు బస్టాండ్‌లో ప్రయాణికులకు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిరంతరాయంగా జరుగుతోంది. ఏప్రిల్ 2వ తేదీన ప్రారంభమైన ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం జూన్ రెండో తేదీ వరకు కొనసాగనుంది. వేసవి కాలంలో ప్రయాణికులకు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఉభయ ఖమ్మంజిల్లాలోని ఏ ఆర్టీసీ బస్టాండుల్లో ఇలాంటి కార్యక్రమం చేపట్టలేదు. పూర్తిగా దాతల సహకారంతోనే చేపట్టిన ఈ కార్యక్రమం 45 రోజులుగా కొనసాగుతుంది. మజ్జిగ పంపిణీ కార్యక్రమం సజావుగా సాగేందుకు గాను.. సత్తుపల్లి డిపోకు చెందిన విలేజ్ బస్సు ఆఫీసర్ కిన్నెర ఆనందరావుకు కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలు అప్పగించారు.

మజ్జిగతో పాటు చల్లటి నీరు..

ప్రయాణికులకు వేసవి తాపానికి ఉపశమనం కలిగించేందుకు గాను మజ్జిగతో పాటు కల్లూరు బస్టాండ్‌లో చల్లని నీరు కూడా అందుబాటులో ఉంచారు. కల్లూరులోని రాజ్యలక్ష్మి సూపర్ మార్కెట్ నిర్వాహకులు ప్రయాణికుల సౌకర్యార్థం ఒక ఫ్రిజ్‌ను అందించారు. అదే విధంగా ఆర్టీసీ సత్తుపల్లి డిపో ఆధ్వర్యంలో అందుబాటులో ఉంది. స్థానికుడు ఆలకుంట నరసింహారావు రోజుకు 25 క్యాన్ల ఫిల్టర్ నీరు అందించేందుకు ముందుకొచ్చారు. కల్లూరు ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా బస్టాండ్‌లో అందుబాటులో ఉన్నాయి. ఇలాంటి సౌకర్యాలు జిల్లాలో ఏ బస్టాండ్‌లో కూడా లేవు.

ముందుకొచ్చిన దాతలు..

కల్లూరు బస్టాండ్‌లో ప్రయాణికులకు.. వేసవి తాపాన్ని తట్టుకునేందుకు తమవంతు సాయంగా చల్లటి మజ్జిగను అందించేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. రెండు నెలల పాటు మజ్జిగను అందించేందుకు దాతలు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ముఖ్యంగా పుట్టిన రోజు, పెళ్లిరోజు, తదితర శుభకార్యాల సందర్భంగా దాతలు మజ్జిగను ప్రయాణికులకు అందిస్తున్నారు.

విజయవంతంగా నిర్వహిస్తున్నాం..



ప్రయాణికుల సౌకర్యార్థం దాతల సాయంతో ఉచిత మజ్జిగ పంపిణి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నాం. దీనివల్ల మహిళలు, వృద్ధులు, అన్ని రకాల ప్రయాణికులకు ఎంతో ఉపశమనం లభిస్తోంది. మజ్జిగ పంపిణీకి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయం.

– కిన్నెర ఆనందరావు, విలేజ్ బస్ ఆఫీసర్

ప్రయాణికుల సౌకర్యార్థం..



బస్టాండ్‌లో మజ్జిగ, చల్లని నీరు ప్రయాణికుల సౌకర్యార్థం అందించటం మంచి పరిణామం. వేసవిలో ప్రయాణికులను ఆదుకోవాలని స్ఫూర్తి కలిగించిన సత్తుపల్లి డిపో మేనేజర్ ఆనందరావుకు కృతజ్ఞతలు. ఇదే స్ఫూర్తితో ఇతర బస్టాండ్‌లలో కూడా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలి.

– కర్నాటి అప్పిరెడ్డి, కల్లూరు



బస్టాండ్‌లో ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం



ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న వైద్య సిబ్బంది